సాక్షి
బాపట్ల
బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



అప్పలస్వామి గుడిలో అరుణహోమం


తెనాలి:తెనాలి మారిస్‌పేటలోని కోదండరామ స్వామి దేవస్థానం (అప్పలస్వామి గుడి) లో రథ సప్తమి సందర్భంగా మంగళవారం ప్రత్యేకంగా అరుణ హోమం నిర్వహించారు.



పురపాలక సంఘ ప్రభకు పూజలు

నరసరావుపేట:కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధికి తరలించే పురపాలక సంఘ ప్రభ ఏర్పాట్లకు మున్సిపల్ అధికారులు మంగళవారం శ్రీకారం చుట్టారు. కమిషనర్ పూజలు చేశారు.

దత్త పీఠం వార్షికోత్సవం



ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం అమీనాబాద్ గ్రామంలోని దత్తపీఠం వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

న్యూస్‌రీల్

వైభవంగా రథసప్తమి ఉత్సవాలు

సప్త వాహనాలపై దర్శనమిచ్చిన నరసింహస్వామి




మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి నగర పరిధిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో రథసప్తమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారు సప్త వాహనాలపై గ్రామోత్సవంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై తొలుత దర్శనమిచ్చారు. అనంతరం శేష, గరుడ, హనుమంతుని వాహనాలపై భక్తులను కటాక్షించారు. భక్తులు పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం స్వామివారు కల్పవృక్ష వాహనం, రాజాధిరాజ వాహనం, చంద్రప్రభ వాహనాలపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా వాహనాల కైంకర్యపరులు ఉత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటి రెడ్డి పర్యవేక్షణలో అర్చకస్వాములు పూజలు చేశారు.

ఈ-క్రాప్ నమోదుకు 15 ఆఖరు తేదీ




సత్తెనపల్లి: జిల్లాలో అన్నదాతలు సాగుచేసే పంట వివరాలను వ్యవసాయ శాఖ పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా పండించిన పంటలు అమ్ముకోవాలన్నా .. విపత్తుల సమయంలో ఇన్‌పుట్ రాయితీ, పంటల బీమా పొందాలన్నా ఈ క్రాప్ నమోదు తప్పనిసరి. ఈ క్రాప్ నమోదు ప్రస్తుతం జరుగుతోంది. నమోదు ప్రక్రియకు ఈ నెల 15 ఆఖరి తేదీ కావడంతో రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రైతులు తమ పంటను నమోదు చేసుకోవడానికి రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి. రైతులు సాగు చేసే వ్యవసాయ భూమి విస్తీర్ణం, సర్వేనెంబర్ ఆధారాలను తీసుకెళ్తే క్షేత్రస్థాయికి వచ్చి వ్యవసాయ శాఖ పోర్టల్‌లో డిజిటల్ ఈ-క్రాప్ నమోదు చేస్తారు. జిల్లాలోని 28 మండలాల్లో 1,35,572 ఎకరాల్లో రబీ పంటల సాగు జరుగుతుంది. ఇప్పటివరకు 1,23,205 ఎకరాల్లో పంటలను రైతులు నమోదు చేసుకోగా 90.9 శాతం ఈ-క్రాప్ పూర్తయింది. 21,940 ఎకరాల్లో రైతులు ఈ-కేవైసీ కూడా పూర్తి చేశారు. ఇంకా 12,367 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు కావలసి ఉంది. జిల్లాలో అత్యధికంగా నరసరావుపేట మండలంలో 7,099 ఎకరాల రబీ సాగు గాను 7,091 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేయడంతో 99.9 శాతం పూర్తయింది. అత్యల్పంగా వినుకొండ మండలంలో 9,637 ఎకరాల్లో రబీ సాగు చేయగా 6,813 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేయడంతో 70.7 శాతం పూర్తయింది.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 550.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,833 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సాగునీటి సమాచారం



తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1,818 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 76 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 203 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 141 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 122 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 45 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 680 క్యూసెక్కులు వదిలారు.

చీరాల టీడీపీలో
వీధికెక్కిన విభేదాలు

- ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు మాజీ మంత్రి పాలేటి శంకుస్థాపన
- శంకుస్థాపనను అడ్డుకునేందుకు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య యత్నం
- పాలేటి పెట్టిన ఎన్టీఆర్ ఫ్లెక్సీని పసుపు నీళ్లతో శుద్ధి చేసిన టీడీపీ నేతలు
- ఎమ్మెల్యేకి తెలియకుండా విగ్రహం ఎలా ఏర్పాటు చేస్తారంటూ జనసేన ప్రశ్న
- ఎంపీపై ఎమ్మెల్యే వర్గీయుల ఆరోపణలు
- విగ్రహం ఏర్పాటు ఆపాలంటూ కలెక్టర్‌కు ఎమ్మెల్యే వర్గం ఫిర్యాదు



సోమవారం రాత్రి పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న మాజీ మంత్రి పాలేటి

సాక్షి ప్రతినిధి,బాపట్ల: చీరాలలో ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య, అదే పార్టీకి చెందిన మాజీ మంత్రి పాలేటి రామారావుల మధ్య విభేదాలు రోడ్డున పడ్డాయి. ఎన్నికల తర్వాత ఎమ్మెల్యేని మాజీ మంత్రి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఒకే పార్టీ, ఒకే సామాజికవర్గం అయినా ఎమ్మెల్యే పాల్గొనే కార్యక్రమాల్లో మాజీ మంత్రి పాల్గొనడంలేదు. తన సొంత వర్గాన్ని కూటగట్టుకొని ప్రత్యేకంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే, మాజీ మంత్రి వర్గాల మధ్య విభేదాలు మరింత పెరిగాయి. తాజాగా చీరాల గడియారస్తంభం సెంటర్‌లో సొంతంగా ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని మాజీమంత్రి పాలేటి సిద్ధమయ్యారు. ఇది ఇరువర్గాల మధ్య చిచ్చురేపింది. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు జనవరి 31న మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయించారు.

రాత్రికి రాత్రే శంకుస్థాపన

సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు పాలేటి రామారావు ఆర్భాటంగా భూమి పూజచేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కార్యక్రమాన్ని అడ్డుకోవాలంటూ పోలీసులను పురమాయించారు. అనుమతులు లేవంటూ పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా కౌన్సిల్ తీర్మానం కాపీని పోలీసులకు చూపారు. దీంతో పోలీసులు అక్కడినుంచి జారుకున్నారు.

ఎమ్మెల్యే బాసటగా జనసేన

ఎమ్మెల్యే కొండయ్యకు బాసటగా జనసేన నేతలు నిలిచారు. ఎమ్మెల్యేకు తెలియకుండా ఎన్టీఆర్ విగ్రహం ఎలా ఏర్పాటు చేస్తారంటూ జనసేన నేతలు ప్రెస్‌మీట్ పెట్టి ప్రశ్నించారు. ఎమ్మెల్యే అనుయాయులుగా ఉన్న కొందరు కౌన్సిలర్లు మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి మాజీమంత్రి ఎన్టీఆర్ విగ్రహం పెట్టకుండా నిలుపుదల చేయాలని విన్నవించారు.

ఎంపీ కృష్ణప్రసాద్‌పై ఆరోపణలు

మాజీ మంత్రి పాలేటి ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు వెనుక బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ హస్తం ఉందని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. టీడీపీ చీరాల మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ కృష్ణప్రసాద్‌పై ఆరోపణలు చేశారు. ఇది స్థానికంగా చర్చనీయాంశమైంది.



కలెక్టర్ వెంకట మురళికి వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య అనుచరులు

ఎన్టీఆర్ ఫ్లెక్సీకి పసుపు నీళ్లు చల్లి నిరసన



పాలేటి రామారావు ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ ఫ్లెక్సీని శుద్ధి చేస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మెల్యే సూచనల మేరకు ఆయన అనుచరులు ప్రత్యక్ష పోరుకు దిగారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొందరు కార్యకర్తలు మంగళవారం పాలేటి రామారావు శంకుస్థాపన చేసిన ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ఫ్లెక్సీకి పసుపు నీళ్లు చల్లి శుద్ధి కార్యక్రమం నిర్వహించారు.

జీవన శైలి మార్పుతో క్యాన్సర్ నుంచి రక్షణ

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి బారి నుంచి ప్రజలు తప్పించుకోవాలంటే జీవన శైలిలో మార్పు రావాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. 'ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం' సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన బాపట్ల పట్టణంలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా చేపట్టిన ర్యాలీని జిల్లా కలెక్టర్ వెంకట మురళి జెండా ఊపి ప్రారంభించారు. నర్సింగ్ విద్యార్థులు, మున్సిపల్ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, అధికారులతో కలిసి కలెక్టర్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పాత బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెడు వ్యసనాలు మానాలని కోరారు. ప్రాథమిక స్థాయిలో ఉన్నప్పుడే క్యాన్సర్ వ్యాధిని అరికట్టగలమన్నారు. దశలు దాటితే ప్రాణాంతకమన్నారు. క్యాన్సర్ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిసలై క్యాన్సర్‌కు గురికావద్దని కలెక్టర్ చెప్పారు. నిండు నూరేళ్లు జీవించాలంటే మీ ఆరోగ్యం మీ చేతిలోనే ఉందన్నారు. మీ అలవాట్లు, జీవనశైలిలో మార్పు ద్వారానే వ్యాధి వ్యాప్తిని పూర్తిస్థాయిలో అరికట్టగలమన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలని, శారీరక శ్రమ ఎంతో ఉపయుక్తమన్నారు. ప్రజలు చైతన్యవంతులై క్యాన్సర్ మహమ్మారిని సమాజం నుంచి పారదోలాలన్నారు. ఎన్నో ప్రమాదకరమైన రోగాలు, వ్యాధులు, వైరస్‌లతో మానవజాతి ఇబ్బందులు పడినప్పటికీ సమర్థంగా ఎదుర్కొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, బాపట్ల ఆర్డీఓ పి గ్లోరియా, మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమా, డీఆర్‌డీఏ పీడీ పద్మ, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ నారాయణ భట్టు, ఎన్‌సీడీసీడీ డాక్టర్ సౌజన్య పాల్గొన్నారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆలయం హుండీ లెక్కింపు

గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామాల ప్రజల ఇలవేల్పు శ్రీ ఘంటాలమ్మ, శ్రీ పుట్టలతమ్మ ఆలయ హుండీని మంగళవారం ఆలయ ఈవో డి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ఆదాయం రూ.2.57 లక్షలు వచ్చిందని ఈవో తెలిపారు. ఆలయ అర్చకుడు రాంబాబు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సూరిశెట్టి హర్ష, పి. నాగభూషణం, శిరసాని వెంకటరావు పాల్గొన్నారు.



అదృశ్యమైన విద్యార్థి శవమై కన్పించాడు

- పర్చూరు అడుసుమల్లి ఎస్సీకాలనీలో విషాదం
- కన్పించకుండా పోయిన బాలుని మృతదేహం కాలువలో లభ్యం
- స్నేహితుల వల్లే చనిపోయాడంటూ బంధువుల ఆరోపణ
- కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు



కాలువలో తేలియాడుతున్న సందీప్ మృతదేహం

పర్చూరు(చినగంజాం): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ విద్యార్థి అదృశ్యమై రెండు రోజుల తరువాత కాలువలో మృతదేహమై కనిపించాడు. ఈ సంఘటన మండలంలోని అడుసుమల్లిలో జరిగింది. విద్యార్థి బంధువుల సమాచారం మేరకు..అడుసుమల్లి ఎస్సీ కాలనీకి చెందిన కుంచాపు సందీప్(15) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అతని తల్లిదండ్రులు గతేడాది ఆత్మహత్య చేసుకున్నారు. సందీప్ అక్కకు వివాహం కావడంతో సందీప్ కాలనీలోని అతని బాబాయ్ వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి బయటికి వెళ్లి వస్తానని చెప్పి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. పొద్దుపోయినా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా.. ఒక గంట ఆగి వస్తానని స్నేహితుల ఫోన్ ద్వారా మెసేజ్ పెట్టినట్లు తెలిసింది. సందీప్ రాత్రికి కూడా ఇంటికి రాకపోవడంతో అక్కయ్య వద్దకు వెళ్లి ఉంటాడని భావించిన బంధువులు..ఆమెకు ఫోన్ చేయగా అక్కడకు రాలేదని చెప్పింది. దీంతో సందీప్ బంధువులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం కాలనీకి సమీపంలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ బావి వద్ద ద్విచక్రవాహనం, చెప్పులు పడి ఉండటాన్ని గమనించిన కాలనీవాసులు బంధువులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన అక్కడకి చేరుకొని బావి పక్కనే ఉన్న కాలువలో సందీప్ మృతదేహం ఉండటాన్ని గమనించి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పర్చూరు ఏఎస్సై సురేష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సందీప్ మృతదేహం

సందీప్ మరణంపై విచారణ జరిపించాలి

స్నేహితుల కారణంగానే తమ బాబు సందీప్ చనిపోయాడని, అతడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని బంధువులు ఆరోపిస్తున్నారు. కేసు సమగ్ర విచారణ జరిపించాలని వారు కోరుతున్నారు.

మిర్చి యార్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి

- విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించబోం
- అధికారులతో మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ



మాట్లాడుతున్న ఆర్‌జేడీ శ్రీనివాసరావు

కొరిటిపాడు (గుంటూరు వెస్ట్): గుంటూరు మార్కెట్ (మిర్చి)యార్డులో సీజన్ ప్రారంభమైందని, రోజుకు లక్షకు పైగా బస్తాలు వస్తున్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) కాకుమాను శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో యార్డు అధికారులు, సిబ్బంది, అందుబాటులో ఉన్న మిర్చి ఎగుమతి వ్యాపారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ముందుగా ఉచిత భోజనం, అల్పాహారశాల, రైతు విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. ఆహార నాణ్యత గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌జేడీ మాట్లాడుతూ.. ఎగుమతి వ్యాపారులు ఏ రోజు కొనుగోలు చేసిన మిర్చిని ఆ రోజే బయటకు తరలించేలా చూడాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా సూచనలు చేశారు. ఉచిత భోజనం, అల్పాహారం నాణ్యత విషయంలో రాజీ పడవద్దని పేర్కొన్నారు. ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాటాలు వేమెన్స్ మాత్రమే వేయాలన్నారు. యార్డులో శుద్ధి చేసిన తాగునీటిని అందించాలని చెప్పారు. రైతు విశ్రాంతి భవనంలో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని పేర్కొన్నారు. వాటర్, బెడ్లు కొరత లేకుండా చూడాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించబోమని స్పష్టం చేశారు. సీజన్‌లో ఇబ్బందులు తలెత్తకుండా మరో 40 మంది సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా నియమించామని పేర్కొన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఉప సంచాలకులు ఝాన్సీ, ఏడీఎం బి.రాజబాబు, యార్డు కార్యదర్శి ఎ.చంద్రిక, యార్డు ఇన్‌చార్జి సుబ్రమణ్యం, శ్రీకాంత్, గ్రేడ్-2, గ్రేడ్-3 కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, ఎగుమతి వ్యాపారులు కె.సుధాకర్, నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

నూరు పడకల వైద్యశాల కలేనా!

- ప్రథమ చికిత్సలకే పరిమితమవుతున్న రేపల్లె కమ్యూనిటీ వైద్యశాల
- చిన్నపాటి వైద్యానికీ సుదూర ప్రాంతాలకు రిఫర్
- మెరుగైన వైద్యం అందక ప్రజల ఇక్కట్లు
- నూరు పడకల వైద్యశాలగా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు హామీ
- ఎన్నికల హామీ అమలుకు శ్రద్ధ చూపని నేతలు



రేపల్లె కమ్యూనిటీ వైద్యశాల

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం కలగానే మిగిలిపోతుంది. రోజురోజుకు పట్టణ జనాభా పెరుగుతున్నారు. అందుకు అనుగుణంగా కమ్యూనిటి వైద్యశాల స్థాయిని పెంచడం లేదు. ఫలితంగా అత్యవసర సేవలు అందడం లేదు. ప్రాథమిక వైద్యం మినహా మిగిలిన సేవలను గుంటూరు, తెనాలి రిఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. అత్యవసర సమయాలలో అంత దూరం వెళ్లలేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పేదలపై ఆర్థిక భారం పడుతుంది.

పెరిగిన ఓపీ

రేపల్లె నియోజకవర్గంలో పెద్దాసుపత్రిగా పేరున్న రేపల్లె కమ్యూనిటీ వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. గతంలో 200 నుంచి 250 వరకు ఉండే ఓపీ ప్రస్తుతం 350కి చేరింది. రేపల్లె పట్టణంతోపాటు నగరం, నిజాంపట్నం మండలాల నుంచి కూడా రోగులు ఇక్కడకు వస్తుంటారు.

తెనాలి, గుంటూరులకు రిఫర్

రేపల్లె కమ్యూనిటీ వైద్యశాల పేరుకే పెద్ద ఆస్పత్రి. ప్రథమ చికిత్సలు మాత్రమే అందుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. రేపల్లె పాత తాలూకా పరిధిలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, భట్టిపోలు ప్రాంతాలలో రహదారి ప్రమాదాలు జరిగిన, పాముకాటుకు గురైనా, విషమాత్రలు మింగినా వారిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుంటారు. వైద్యులు, వైద్య సిబ్బంది కేవలం ప్రథమ చికిత్స చేసి తెనాలి, గుంటూరుల్లోని ప్రభుత్వ వైద్యశాలలకు రిఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. సరైన వసతులు లేకపోవడంతోనే రిఫర్ చేయాల్సి వస్తుందని వైద్యులు చెబుతున్నారు.

100 పడకలతో ప్రయోజనాలెన్నో...

రేపల్లె కమ్యూనిటీ వైద్యశాలను 100 పడకల వైద్యశాలగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంత వాసులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. ఇప్పటివరకు ప్రథమ చికిత్సలకే పరిమితమైన వైద్యశాలలో అత్యవసర సేవలు అందుబాటులోకి వస్తాయి. గుండె, ఎముకల, ఇతర శస్త్ర చికిత్స వైద్య నిపుణులు అందుబాటులోకి వస్తారు. 24 గంటలు వైద్యసేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది కొరత ఉండదు. తీర ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మెరుగుపడతాయి.

ఉన్నతాధికారులకు వివరించాం

వైద్యశాల అభివృద్ధి ఆవశ్యకతను ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రస్తుతం 30 పడకలు ఉన్న వైద్యశాలను 100 పడకలుగా అభివృద్ధి చేసే 24 గంటలు అత్యాధునిక సేవలు అందుతాయి.

–సుధాకరరావు, సూపరింటెండెంట్, రేపల్లె

చంద్రబాబు హామీ అమలయ్యేనా?

ఎన్నికలకు ముందు రేపల్లె పర్యటనకు విచ్చేసిన సీఎం చంద్రబాబు రేపల్లె కమ్యూనిటీ వైద్యశాలను నూరు పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 8 నెలలు గడుస్తున్నా వైద్యశాల అభివృద్ధి ఊసేత్తడం లేదు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రేపల్లె నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం విదితమే.

అడవిని తలపిస్తున్న వైద్యశాల ప్రాంగణం

కమ్యూనిటీ వైద్యశాల భవన ప్రాంగణం అడవిని తలపిస్తోంది. వైద్యశాల వెనుక వైపు పిచ్చిమొక్కలు ఏపుగా పెరగటంతో విషపురుగుల సంచారం అధికంగా ఉంది. దీంతో రోగులు, వైద్య సిబ్బంది భయాందోళన చెందుతున్నారు.



వైద్యశాల వెనుక వైపు పెరిగిన పిచ్చిమొక్కలు

వైభవోపేతంగా కార్తికేయుని రథోత్సవం

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపిదేవిలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి శ్రీస్వామివారి రథోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, నిత్యహోమం, బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలతో ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి రథోత్సవం కనుల పండువగా సాగింది. ప్రత్యేక పల్లకీలో స్వామివారు, అమ్మవార్లను ప్రతిష్ఠించి వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం ఆలయ అధికారులు, పోలీసుల సంరక్షణలో రథం వరకు తోడ్కొని వచ్చారు. విద్యుత్ దీపాలు, పూలదండలతో అందంగా అలంకరించిన రథంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను చేసి ఆలయ నిర్వహణాధికారి శ్రీరామ వరప్రసాదరావు టెంకాయ కొట్టి రథాన్ని ముందుకు లాగారు. అనంతరం ప్రధాన రహదారిలో రావివారిపాలెం వైపు వంతెన, తిరిగి పెదప్రోలు వైపు 11వ నంబర్ కాలువ వంతెన, ఎంపీడీఓ కార్యాలయం వరకు మూడువైపులా ప్రధాన రహదారుల వెంట రథోత్సవం నిర్వహించారు. రథం తిరిగే ప్రధాన బజారుల్లో దారిపొడవునా భక్తులు స్వామివారికి టెంకాయలు, పండ్లు, పూలు, కానుకలు సమర్పించి, హారతులు ఇచ్చారు. దేవస్థానం ఏర్పాటు చేసిన తీన్‌మార్, పలు రూపాల్లో కళాకారులు నాట్య విన్యాసాలు, బాణసంచా వెలుగులు, యువకుల కేరింతల మధ్య రథోత్సవం ముందుకు సాగింది. అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ ఆధ్వర్యంలో చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ పోలీస్ బందో బస్తు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు రథోత్సవం కొనసాగింది, అనంతరం స్వామివార్లు ఆలయ ప్రవేశం చేశారు.



రథంపై ఊరేగుతున్న స్వామివారు

పొగాకు ప్రైవేట్ కంపెనీలు సిండికేట్

● గిట్టుబాటు ధరలు లేక విలవిలాడుతున్న బర్లీ పొగాకు రైతులు
● రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య


మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

జె.పంగులూరు: బర్లీ పొగాకు కొనుగోళ్లలో ప్రైవేట్ కంపెనీలు సిండికేట్‌గా మారాయని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బాధ్యత తీసుకొని రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కంపెనీల మాటలు నమ్మి రైతులు ఇతర పంటను వదిలేసి పొగాకు పంటను అధికంగా సాగు చేశారని, ప్రస్తుతం ధరలు లేకపోతే రైతులు భారీగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. పంగులూరులో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బర్లీ పొగాకు సాగుకు ఎకరాకు రూ.1.20 లక్షల వరకు ఖర్చవుతుందని, ప్రస్తుతం ధరలు చూస్తే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం ఈ ఏడాది 62,735 ఎకరాల్లో రైతులు పొగాకు సాగు చేయగా, అనధికారికంగా మరో 40 వేల ఎకరాల్లో సాగు చేసినట్లు తెలుస్తోందన్నారు. 90 శాతం మంది కౌలు రైతులు పంటలు సాగు చేస్తున్నారన్నారు. వారిలో 90 శాతం మంది రైతులు ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులేనని తెలిపారు. ఈ ప్రభుత్వంలో కౌలు రైతులకు రక్షణ లేదని, వ్యవసాయాన్ని, రైతులను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామారావు, వినోద్‌బాబు, పి.ఆదుంసాహెబ్, కౌలు రైతు రాయిణి కిరణ్, డాక్టర్ మంచాల నమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిని కప్పేసిన పొగ మంచు


దట్టమైన పొగ మంచుతో జాతీయ రహదారి

చెరుకుపల్లి: చెరుకుపల్లి మండలంలోని పలు ప్రాంతాలను మంగళవారం పొగమంచు కప్పేసింది. తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగ మంచు కురవటంతో వాహనదారులు రహదారి కనిపించక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10 గంటల వరకు పొగ మంచు వీడకపోవటంతో పాఠశాల, కళాశాలలకు వెళ్లే బస్సులు ఆలస్యంగా వెళ్లాయి. స్థానిక ఎస్సై అనిల్‌కుమార్ మాట్లాడుతూ మంచు కాలంలో వాహనదారులు వేగంగా నడిపి ప్రమాదాలకు గురికావద్దని ప్రతి వాహనదారుడు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదివితే సత్ఫలితాలు వస్తాయని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీ వేంకటేశ్వర బాల కుటీర్‌లో మంగళవారం మిడిల్, సెకండరీ క్యాంపస్‌ల 50వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యను ఒక మూస పద్ధతిలో కాకుండా తల్లిదండ్రులు, పిల్లల అభిరుచికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మనం దేశాన్ని, పెద్దలను, గురువులను, తల్లిదండ్రులను తప్పక గౌరవించాలన్నారు. జై జవాన్, జై కిసాన్ అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పాఠశాల సీఏవో దుర్గా రఘురామ్ మాట్లాడుతూ.. శాంతి, ఆరోగ్యం, సహాయ సహకారాలకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మొబైల్ ఫోన్‌ను అత్యవసరాలకే పరిమితం చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు పొలడుగు లక్ష్మణరావు, ప్రిన్సిపల్ సుధామాధవి, వైస్ ప్రిన్సిపల్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వికీపీడియాతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

వికీపీడియా ప్రాజెక్ట్ టీం ప్రోగ్రాం మేనేజర్ కృపాల్ కాశ్యప్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రామారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో డిగ్రీ విద్యార్థులు వికీపీడియాపై అవగాహన పెంచుకోగలిగితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు హెచ్చుగా ఉంటాయని హైదరాబాద్‌కు చెందిన వికీపీడియా ప్రాజెక్ట్ టీం ప్రోగ్రాం మేనేజర్ కృపాల్ కాశ్యప్ పేర్కొన్నారు. మంగళవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో తెలుగు విభాగ ఆధ్వర్యంలో వికీపీడియాపై తెలుగులో వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కృపాల్ కాశ్యప్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా 350 భాషల ద్వారా సమస్త విజ్ఞానం గురించి తెలుసుకునే అవకాశం వికీపీడియా వల్ల కలిగిందన్నారు. ఎన్‌సైక్లోపీడియా అని పిలవబడే వికీపీడియా నిలదొక్కుకోవడానికి గూగుల్, యాపిల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు సహకరిస్తున్నాయని చెప్పారు. టీఈ.వికీపీడియా.ఓఆర్‌జీ లింకు ద్వారా తెలుగు వికీపీడియాలోనికి ప్రవేశించి భాషా సంస్కృతులు, భౌగోళిక స్వరూపాల గురించి అధ్యయనం చేయవచ్చునని వివరించారు. తెలుగు వికీపీడియా రచయిత యర్రా రామారావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ వికీపీడియా అంశంతో తమ కళాశాలలో డిగ్రీ తరగతులు ఉన్నాయని చెప్పారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థినులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ నల్లపనేని విజయలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ వాసిరెడ్డి భవాని, డాక్టర్ దివిజా దేవి, డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి, డాక్టర్ డి.ధాత్రి కుమారి పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థినికి బంగారు పతకం


విద్యార్థిని ఆర్.కళా జోత్స్నను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థిని తైక్వాండోలో జాతీయ స్థాయి పోటీలలో బంగారు పతకం సాధించిందని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. తమ యూనివర్సిటీలో రెండో సంవత్సరం సీఎస్ఈ చదువుతున్న ఆర్.కళాజ్యోత్స్న ఇటీవల తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలలో ఈ పతకం సాధించిందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ తరపున అండర్ – 67 కేజీల సీనియర్ ఉమెన్ కేటగిరీలో పతకం కైవసం చేసుకుందని తెలిపారు. విద్యార్థినిని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, డీన్లు అభినందించారు.

శ్రీశ్రీ మహాప్రస్థానం మహా ప్రభంజనం

అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వర్


జ్వాలాతోరణం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వర్

బాపట్ల: శ్రీ శ్రీ మహాప్రస్థానం తెలుగు సాహిత్య రంగాన్ని కుదిపేసిందని జిల్లా అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ పేర్కొన్నారు. మహాప్రస్థానం 75 వసంతాల సందర్భంగా శ్రీ శ్రీ సాహిత్య నిధి వారు ప్రచురించిన ' జ్వాలాతోరణం' పుస్తకాన్ని మంగళవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు అధ్యక్షత వహించారు. జిల్లా అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ పుస్తకావిష్కరణ చేశారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ తెలుగువారిని కదిలించివేసి, అందులోని అక్షరాలే కత్తులుగా, ఈటెలుగా మారి, బడబాగ్నిని రగిలించాయని, పేదవాళ్ల కన్నీళ్లు తుడుస్తాయని చెప్పారు. ఎందరికో స్వాంతన కలిగిస్తాయని అన్నారు. అది భవిష్యత్తుకు మార్గదర్శనం చేస్తుందని తెలిపారు. విజయవాడ శ్రీ శ్రీ సాహిత్య అధినేత, కవి సింగంపల్లి అశోక్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభలో శ్రీ శ్రీ జాతీయ పురస్కార గ్రహీత అడుసుమిల్లి మల్లికార్జునను అదనపు ఎస్పీ సత్కరించారు. కార్యక్రమంలో చిత్రకారుడు జీవి, ఉపాధ్యాయులు ఎన్ రామకృష్ణ, అధ్యాపకులు అబ్దుల్ కలాం, గురజాల శ్రీనివాసరావు, ఇక్కుర్తి శ్రీనివాస్, పిన్నిబోయిన శ్రీమన్నారాయణ, మానవత కార్యదర్శి ఎం.ప్రసన్నాంజనేయులు, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలి

● ప్రభుత్వం సిబ్బంది, నిధులు కేటాయించాలి
● రెవెన్యూ అసోసియేషన్ సమావేశంలో తీర్మానాలు


మాట్లాడుతున్న అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్

లక్ష్మీపురం: రెవెన్యూ ఉద్యోగులపై పని ఒత్తిడిని తగ్గించాలని, పని భారం ఆధారంగా ప్రతి మండలం, డివిజన్, కలెక్టర్ కార్యాలయాల్లో సిబ్బందిని పెంచాలని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. అసోసియేషన్ భవన్‌లో మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ కార్యాలయాల్లో కనీస వసతులు కూడా లేక ఉద్యోగినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించనందున, పని ఒత్తిడితోపాటు ఆర్థిక ఒత్తిడి కూడా పెరిగిందన్నారు. శిథిలావస్థకు చేరుకున్న రెవెన్యూ కార్యాలయాల స్థానంలో కొత్తవి నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అయిదు సంవత్సరాల క్రితం నిర్మించిన తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలను కాంట్రాక్టర్ల నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించామన్నారు. సిబ్బందికి చట్టాలపై అవగాహన అవసరమని, శిక్షణ తరగతుల బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్ మాట్లాడుతూ.. ఇటీవల కోర్టు ధిక్కరణ కేసులలో కౌంటర్లు వెయ్యడానికి ఉద్యోగులు రూ.లక్షలు తమ జీతాల నుంచి చెల్లిస్తున్నారని తెలిపారు. తహసీల్దారు, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులకు కేటాయించిన అద్దె వాహనాలకు బిల్లులు చెల్లించడానికి నిధులు లేక సొంతంగా ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రతి జిల్లాకు ప్రోటోకాల్ నిమిత్తం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ వెంకటరావు, నాయకులు అనుపమ, అయూ, విజయ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

బైబిల్ మిషన్ స్త్రీల సభల కన్వీనర్ మహిమ ప్రవేశం

వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కాకాని స్వస్థిశాలలో ప్రత్యేక ప్రార్థనలు


ప్రమీలా సెల్వరాజ్ (ఫైల్)

పెదకాకాని: బైబిల్ మిషన్ స్త్రీల సభల కన్వీనర్, రెండో శనివారం ఉపవాస ప్రార్థన నిర్వాహకులు డాక్టర్ జె.ప్రమీలా సెల్వరాజ్ సోమవారం గుంటూరులో ప్రభువు సన్నిధిని చేరారు. రాత్రి ఆమె భౌతికకాయాన్ని పెదకాకాని స్వస్థిశాలకు తీసుకొచ్చి మంగళవారం ఉదయం వరకు నిర్విరామంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంగళవారం భూస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ప్రమీలమ్మ మహిమ ప్రవేశ వార్త విన్న భక్తులు వేలాదిగా తరలివచ్చి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బైబిల్ మిషన్ అధ్యక్షుడు, పెదకాకాని స్వస్థిశాల నిర్వాహకులు రెవరెండ్ జె. శామ్యేల్ కిరణ్ వాక్యోపదేశం చేశారు. ప్రమీలమ్మ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్ అబ్రహం, బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.జాన్ దేవదాసు, సెక్రటరీ రెవరెండ్ కె.ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రటరీలు రెవరెండ్ డి.సుధాకర్, రెవరెండ్ జె.ఆగమన రావు, రెవరెండ్ ఎం.రవి, ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల ఇమ్మానుయేలు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు


ఆరు పళ్ల విభాగంలో మొదటి బహుమతి సాధించిన వేటపాలెం ఎడ్ల జత

నాదెండ్ల: నాదెండ్ల-గణపవరం డొంక రోడ్డులో కొలువైయున్న నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. వీక్షకుల కేరింతలు, ఎడ్ల బలప్రదర్శనతో దుమ్మురేపాయి. మంగళవారం ఆరు పళ్ల విభాగంలో 11 జతలు పాల్గొన్నాయి. సోమవారం రాత్రి వరకు నాలుగు పళ్ల విభాగంలో 7 జతలకు పోటీలు జరిగాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి న్యూ కేటగిరి విభాగంలో పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కేటగిరీలో 13 జతల ఎడ్లు పాల్గొన్నాయి. బుధవారం సబ్‌జూనియర్స్ విభాగంలో జరగనున్నాయి.

నాలుగు పళ్ల విభాగంలో చిలకలూరిపేట జతకు ప్రథమ బహుమతి..

నాలుగు పళ్ల విభాగంలో ఏడు జతలు పాల్గొన్నాయి. చిలకలూరిపేట పట్టణం పురుషోత్తమపట్నంకు చెందిన షేక్ అబ్దుల్‌సత్తార్, అమీర్‌బాబు ఎడ్ల జత 3962 అడుగుల దూరం లాగి ప్రథమస్థానం కైవసం చేసుకుంది. రెండో బహుమతిని బాపట్ల జిల్లా జె.పంగులూరు గ్రామానికి చెందిన గొట్టిపాటి రవికుమార్ యూత్ జత 3923 అడుగుల దూరం లాగాయి. మూడో బహుమతిని కృష్ణాజిల్లా పెనమలూరు మండలం యనమలకుదురుకు చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీమధు జత 3576 దూరం లాగి గెలుపొందాయి.

ఆరు పళ్ల విభాగంలో..

ఆరుపళ్ల విభాగంలో 11 జతలు పాల్గొనగా, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష్‌చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 4 వేల అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య శ్రీ మధు జత 3621 అడుగుల దూరంతో రెండో స్థానాన్ని, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన జీఎల్ఆర్ బుల్స్ గరికపాటి లక్ష్మయ్యచౌదరి, రాయుడు సుబ్బారావు జత 3399 అడుగుల దూరంతో మూడో స్థానాన్ని సాధించాయి. ఎడ్ల జతల యజమానులకు కమిటీ సభ్యులకు షీల్డ్, నగదును అందించారు.

పకడ్బందీగా ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు

జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి నీలావతిదేవి


సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఇంటర్మీడియెట్ అధికారులు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణలో భాగంగా ఈనెల 5వతేదీ నుంచి 20 వరకు జరగనున్న ఒకేషనల్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పల్నాడుజిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి, పరీక్షల స్పెషల్ ఆఫీసర్ కె.వేణు తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదని సూచించారు. జిల్లాలో ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు 14 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 1,874మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరవుతారన్నారు. వీరిలో 1,094మంది ప్రథమ, 780 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారని వివరించారు. ఆయా కేంద్రాలకు 14 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, సబ్జెక్ట్ ఎగ్జామినర్లను నియమించామన్నారు. ప్రాక్టికల్ పరీక్ష ఆదివారంతో సహా ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు రెండు సెషన్స్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పరీక్ష సమయానికి 30 నిమిషాలు ముందుగా సీఎస్‌లకు ఓటీపీ ద్వారా ప్రశ్నాపత్రం అందుతుందని, దానిని ఎగ్జామినర్లకు అందజేసి సరైన సమయానికి పరీక్షను ప్రారంభించాలని తెలిపారు. విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్ష మెటీరియల్ అందచేసే సిబ్బంది సదరు మెటీరియల్‌ను అందచేసి వెంటనే పరీక్ష హాల్ నుంచి వెళ్లిపోవాలని తెలిపారు. పరీక్ష పూర్తయిన తరువాత కళాశాల నుంచే ఆన్‌లైన్‌లో మార్కులను అప్‌లోడ్ చేయాలని వివరించారు. సమావేశంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు, నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల మండిపై కుక్కల దాడి

15 గొర్రెలు మృత్యువాత



నూజెండ్ల(శావల్యాపురం): నూజెండ్ల మండలంలోని దాట్లవారిపాలెం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి గొర్రెల మండిపై కుక్కలు దాడి చేసిన ఘటనలో 15 గొర్రెలు మృత్యువాత పడగా 10 గొర్రెలకు గాయాలయ్యాయి. రూ.3లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు మోరబోయిన వీరయ్య తెలిపారు. తన తండ్రి అప్పు చేసి 30 జీవాల పిల్లలను కొనుగోలు చేసి పెంచుకుంటున్నారని, ఇటువంటి ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

చినగంజాం: మండలంలోని మున్నంవారిపాలెం గ్రామ పరిధిలో వైఎస్సార్‌సీపీ అనుయాయులపై టీడీపీ వర్గీయులు దాడి చేసిన సంఘటనకు సంబంధించి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ పెర్నేటి పేరి లింగేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసిన వారిలో మున్నంవారిపాలేనికి చెందిన కోకి పవన్‌కుమార్, కోకి రామిరెడ్డి, కోకి లక్ష్మారెడ్డి, రాజుబంగారు పాలేనికి చెందిన కోకి భాస్కరెడ్డి, కోకి శివరామిరెడ్డి, కోటిరెడ్డి, పలపట్ల అభి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. విద్యార్థులకు గాయాలు


అనన్య

అచ్చంపేట: విద్యార్థులతో వెళుతున్న ఆటో బోల్తా కొట్టగా నలుగురికి గాయాలైన ఘటన మండలంలోని తాడువాయి – కొత్తపల్లి గ్రామాలమధ్య మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తాడువాయి నుంచి తాళ్లచెరువులోని ఓ పాఠశాలకు నిత్యం ఎనిమిది మంది విద్యార్థులు వచ్చి వెళుతుంటారు. రోజులాగే ఆటోలో మంగళవారం ఉదయం తాడువాయిలో ఎనిమిది మందిని ఎక్కించుకుని తాళ్లచెరువు వస్తుండగా గ్రామానికి సమీపంలో పంటపొలాలవద్దగల మలుపు తిరుగుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఆటోను ఢీ కొట్టింది. ఆటో రెండు పొర్లుగింతలు వేసి పంట పొలాలలో పడింది. అందులో ప్రయాణిస్తున్న మూడో తరగతి విద్యార్థిని అనన్య ఎడమ చేతికి తీవ్ర గాయమైంది. మెరుగైన వైద్యం కోసం తల్లిదండ్రులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. గౌతమ్, దీపిక, అక్కి, మిల్కి, హనీ, దీవెనలకు స్వల్ప గాయాలయ్యాయి. మలుపులో ఎదురుగా వస్తున్న వాహన కనిపించకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.